## మతిలేని మతిమరపు

మావారు ఎప్పుడూ నన్ను "మతిమరపు పెద్దమా" అని అంటూంటారు. మీరే చెప్పండి, అన్నం వడ్డించే తొందరలో, మంచినీళ్ళు పెట్టటం మరిచాననుకోండి. ఎప్పుడో అవుసరం వచ్చే నీళ్లకు ఇప్పుడు తొందర ఏమిటి అని వూరుకోరు. "అదిగో మతిమరపు" అబ్బ! నీలాంటివాళ్ళు ఇక ప్రపంచములో వుండబోరు అని అంటారు. ఈ రకంగా అంటూవుంటే నాకు అదోలా వుండేది. ఒకరోజు మా స్నేహితురాలు, రాధ మా ఇంటికి వచ్చింది. మాటల్లో మావారు ఇలా అంటారు. నేనేనా అంత మతిమరపు ఇంకా ఎవరన్నా వుంటారా అన్నాను. దాంతో ఆవిడ పగలబడినవ్వుతూ, మా అన్నయ్య నాకో కథ చెప్పాడు, వాడికి స్వానుభవంగా జరిగిందట, ఈ కథ మీ ఆయనకు చెప్పి ఏమిటి మీ సమాధానమని అడుగు అంది. ఆ కథే ఈ కథ.

ఒకసారి వాళ్ల అన్నయ్యవాళ్ళు స్కౌట్ క్యాంపుకు వెళ్ళారట. మామూలుగా దూర, దూరంగా ఒక తోటలో టెంట్లు వేసుకున్నారట, మధ్యలో ఒక టెంటులో, ఒక గంటకట్టి అక్కడ ఒక కుర్రవాణ్ణి పెట్టి టైము ప్రకారం గంటకొట్టితే వాళ్లు చేయవలసిన పనులు నిర్ణయించుకుంటారట. వాళ్ల రూలు ప్రకారం 2 గంటలు కొడితే ప్రార్థన, 3 కొడితే స్కౌట్ మాష్టరు ఇనస్పెక్షనుకు వస్తున్నట్టు, అదేవిధంగా 5 కొడితే టిఫెనుకు రమ్మని అర్థం. అదేవిధంగా మాష్టరు ఆర్డరు ప్రకారం రెండు గంటలు కొట్టమన్నారు. వాడు మరచిపోయి పొరపాటున 3 గంటలు కొట్టాడు. వెంటనే తన తప్పు తెలుసుకొని, ఆ గంటమీద తన జేబుగుడ్డతో తుడిచి (అంటే ఆ రకంగా తుడిచేస్తే మొదట కొట్టిన మూడు గంటలు చెరిగిపోయి విలువలేనట్లు అని అతని వూహ) మరల రెండు గంటలు కొట్టాడట. మొత్తం 5 గంటలయ్యాయి. అందరూ టిఫిను తిందామని కుక్ టెంట్ దగ్గరకు పరిగెత్తుకొచ్చారట. అంతా తెలుసుకొని, మనవాడి మతిమరుపు మతిలేంది అన్నారట. ఈ కథ మావారికి చెప్పి మీ సమాధానం అన్నాను. దాంతో వారి గొంతుకలో పచ్చి వెలక్కాయ పడ్డట్లుయింది సమాధానం కోసం. మీరే చెప్పండి ఎవరి మతిమరపు గొప్పదో.

కూరాళ్ల స్వరాజ్యలక్ష్మి

* * *

## గుణపాఠం

అచ్యుతరావు గుణపాఠం చాలా చెడ్డది — వాడి దృష్టి ఎప్పుడూ 'ఫిమెయిల్స్' మీదే వుంటూంటుంది... అందమైన ఆడది కనిపించిందంటే— మరిక అచ్యుతరావు పడే తిప్పలు ఆ అంతర్యామికే తెలియాలి.

అచ్యుతరావు ఓసారి వాళ్ల తాతగారి వూరు వెళ్ళాడు. అదంతా ఏజన్సీ ప్రాంతం. తాతగారి ఇంటిప్రక్కనే ఓ పాడుపడిన 'బంగళా' వుంది పగటి పూట ఆ బంగళాలోకి వెళ్లటానికే అందరూ భయపడుతుంటారు. దయ్యాలున్నాయని ప్రతీతి కూడాను.

అచ్యుతరావు పొరుగింటి 'ఫారెస్టు' గార్డు డాటర్‌ని 'లవ్' చేసాడు. కాని ఆ అమ్మాయి మన కథానాయకుణ్ణి ప్రేమించలేదు సరికదా పైగా మన వాణ్ణి చూసి అసహ్యించుకునేది! కాని వెనుక పెద్దలగౌరవాన్ని చూసి అచ్యుతరావు ఎన్ని చిలిపి పనులు చేసినా 'కామ్'గా వూరుకునేది. ఆమె మౌనాన్ని అర్థాంగీకార సూచకంగా భావించి మన వాడు 'బ్రేవ్'గా 'ప్రణయలేఖలు' వినరటం మొదలుపెట్టాడు. దాంతో ఆమె ఉన్నకొద్ది సహనంకూడా కోల్పోయింది.

ఒకరోజు అచ్యుతరావు ఆమెనుంచి 'లెటర్' పొందగలిగాడు. ఆ 'లెటర్'లో వ్రాయబడ్డ సాంకేతికస్థానమైన బంగళాకి చేరుకున్నాడు! రాత్రి 12 గంటల సమయం ... బంగళా భయంకరంగా వుంది ... ప్రణయదేవతకోసం ఎదురు చూస్తున్నాడు అచ్యుతరావు. ఇంతలో పెద్ద చప్పుడైంది వెనుక భాగంలో. వెంక్కుతిరిగాడు. బంగళా పడమటివైపు వరండాలోంచి భయంకరమైనకూతలు ధ్వనులు వినవచ్చాయ్! ... అచ్యుతరావు గుండెలు 'బెండమూరు' లంకలు పట్టాయ్! ఇంతలో ఓ ఇటికముక్క వచ్చి ఎదుటిగోడకు గుద్దుకుని అచ్యుతరావు కాళ్లముందు పడింది! మనవాడు దాంతో గుండెలు చేత్తోపట్టుకుని రెండు అంగలలో ఇల్లుచేరుకున్నాడు. ప్రేయసిని మరి స్మరిస్తే ఒట్టు. మర్నాడు ఆమె "రాత్రి రాలేదేమండీ?" అని అడిగింది. అచ్యుతరావు నల్లగా ముఖం మాడ్చుకుని ఇంట్లోకి వెళ్లిపోయాడు.

చిన్న రహస్యం: అచ్యుతరావుకు బుద్ధి తెప్పించాలనే ఉద్దేశ్యంతో ఆమే ఆ హంగామా చేసిందని తరువాత తెలిసింది! ఈ విషయం మరెక్కడా పొక్కనీయకండి!

కె. వర్ధనరావు

* * *

## శివాజి పటం

ప్రతిరోజు మా పక్కింటి అమ్మాయి, తాతగారిదగ్గర తెలియని పాఠాలు చెప్పించుకొంటోంది. ఓ దినం తాతగారు పాఠంచెప్పడం మొదలుపెట్టారు ఆదినం శివాజిపాఠం ఛత్రపతికి తల్లి చిన్నతనములోనే మహావీరుల కథలు, వారి ధైర్యసాహసాలు, వారి దేశభక్తి గురించి చెప్పేది. అందువల్లనే ఛత్రపతికూడ శూరుడు, దేశభక్తుడయ్యాడు. అంటూ చటుక్కున ఆగిపోయి, ఎదురుగా గోడమీద వ్రేలాడుచున్న, బూజుపట్టి అద్దంపగిలిపోయిన 'శివాజి' పటం